# అభినందన

**- డా॥ కె.వి. రమణాచారి**

ఆచార్య మొదలి నాగభూషణశర్మ సాహితీవేత్తలందరూ అభినందించదగిన సారస్వతమూర్తి. ఆయన ఒక ఆచార్యుడిగా పనిచేసినా నాటకరంగంలో కానీ, జానపద కళారంగంలో కానీ, వారందించిన సేవలు నిరుపమానం. ఇంగ్లీష్ ప్రొఫెసర్‌గా ఎంత మంచిపేరు తెచ్చుకున్నారో, థియేటర్ ఆర్ట్ ప్రొఫెసర్‌గా కూడా అంతే మంచిపేరు తెచ్చుకున్నారు. జర్మనీ, బ్రిటన్ లాంటి విదేశాలలో భారతీయ నాటకరంగం గురించి ఆయన ఎంత అవగాహన కలిగించారో నేనెరుగుదును. మన తోలుబొమ్మలాట అంతర్జాతీయఖ్యాతి గడించడం వెనుక ఆయన చేసిన కృషిని ఈనాటి తరం మరువకూడదు.

నాగభూషణశర్మగారు ఈనాటి తరానికే కాదు, వచ్చే తరాలకు కూడా ఒక స్ఫూర్తి. నాటకరంగం వేళ్లూనుకోవాలని, 1990లో నేను సాంస్కృతికశాఖ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రోజులలో 'అఖిలాంధ్ర నాటకోత్సవాలు' నిర్వహించాను. ఈ ఉత్సవాలకు కారకులు, ప్రేరణ ఆచార్య మొదలి నాగభూషణశర్మగారే. తరువాతికాలంలో (1999) నంది నాటకోత్సవాలు నిర్వహించడానికి కూడా వారందించిన సహకారాన్ని నేనెన్నటికీ మరిచిపోలేను. పద్యనాటకానికి నంది నాటకోత్సవాలు ఎంతగా తోడ్పడ్డాయో నాటక ప్రముఖులందరికి తెలిసినదే. ఈనాటికీ తెలుగునాట నంది నాటకోత్సవాలు నిర్వహించబడుతున్నాయంటే పెద్దలు నాగభూషణశర్మగారిలాంటి మహానుభావుల సలహాలు, సూచనలే కారణం.

1993లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజధానియైన హైదరాబాద్ నడిబొడ్డున ఆంధ్ర సాహిత్యపరిషత్‌లో రసరంజని స్థాపించబడింది. గరిమెళ్ల రామమూర్తిగారు, శంకరాభరణం సోమయాజులుగారు, చాట్ల శ్రీరాములుగారు, మొదలి నాగభూషణశర్మగారు అనే నాలుగుస్తంభాలమీద రసరంజని సౌధం నిలబడింది. పాతికేళ్లు దాటిన రసరంజని ఎంతో సమర్థవంతంగా నిర్వహించబడుతూ ఉందంటే దానికి కారణం కార్యనిర్వాహక అధ్యక్షులుగా నాగభూషణశర్మగారు వేసిన పునాది, పెట్టిన ఒరవడి.

వారు సాహిత్యరంగంలోనే కాక నాటకరంగంలో కూడా ప్రముఖ దర్శకుడిగా, రచయితగా ఎందరికో ఆదర్శంగా నిలిచారు. వారు రచించిన 'ప్రకాశం పంతులు' నాటకం తెలుగునాట అంతా జయభేరి మోగిస్తూ రసరంజని ప్రదర్శించటం నాటకాభిమానులందరికీ విదితమే. ఇప్పుడు నాటకానికి, నాటకరంగ వికాసానికి తెలుగునాట ఎంతో సేవచేస్తున్న అజో-విభొ-కందాళం ఫౌండేషన్‌వారు 2019 సంవత్సరానికి మా నాగభూషణశర్మగారిని ప్రతిభామూర్తి పురస్కారానికి ఎంపికచేయడం నాలాంటి సాహిత్యాభిమానులకీ, రంగస్థల అభిమానులకీ ఎంతో ఆనందదాయకం.

పురస్కారం ప్రదానం చేస్తున్న అప్పాజోస్యుల సత్యనారాయణగారికి, పురస్కారం అందుకుంటున్న ఆచార్య మొదలి నాగభూషణశర్మగారికి ఇద్దరికీ అభినందనపూర్వక నమస్కారాలు.